క్లుప్తంగా

ఉప ఎన్నికకు పోలింగ్ కేంద్రాల నోటిఫికేషన్



కరప మండలపరిషత్ కార్యాలయంలో నోటీసుబోర్డు వద్ద ఎంపీడీఓ స్వప్న

కరప: మండల పరిధి రెండు గ్రామ పంచాయతీల్లో ఇద్దరు వార్డు సభ్యులు మృతి చెందడంతో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నోటీసుబోర్డులో పోలింగ్ కేంద్రాల నోటిఫికేషన్ విడుదలచేసి మాట్లాడుతూ గొడ్డటిపాలెంలో ఆరో వార్డు సభ్యుడు సోడాబత్తుల సత్యనారాయణ, నడకుదురులో ఏడో వార్డు సభ్యుడు పిల్లి లక్ష్మణుడు అనారోగ్యాలతో మృతి చెందారని, డీపీఓ ఆదేశాలతో ఆయా గ్రామాల్లో ఉప ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. గొడ్డటిపాలెం వార్డులో 159 మంది, నడకుదురు వార్డులో 401 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల తేదీ ప్రకటించాల్సి ఉందని ఎంపీడీఓ స్వప్న తెలిపారు. మండల ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, గొడ్డటిపాలెం గ్రామకార్యదర్శి రాంజీ హీరాలాల్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఫీల్డ్ మేనేజర్ వరప్రసాద్

బాలాజీచెరువు: స్థానిక యూనియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ వృద్ధుల ఆశ్రమానికి నిత్యవసర వస్తువులు, వెట్ గ్రైండర్ అందజేశారు. బ్యాంక్ వైజాగ్ రీజియన్ ఫీల్డ్ జనరల్ మేనేజర్, కేఎస్‌డీఎస్ వరప్రసాద్ (వైజాగ్) రీజనల్ హెడ్ కేఎస్‌వీ చిన్నారావు, డిప్యూటీ రీజనల్ హెడ్ డీవీ రంగారావు పాల్గొన్నారు.

వైరల్ వ్యాధులపై అప్రమత్తం

కాకినాడ రూరల్: శీతాకాలం నుంచి వేసవిలోకి వస్తున్నందున వైరస్ వ్యాధులు సహజంగానే వ్యాపిస్తాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని పండూరు పీహెచ్‌సీ డాక్టర్ ఆయేషా ఫాతిమా పేర్కొన్నారు. రమణయ్యపేట బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈ మేరకు అవగాహన కల్పిస్తూ వైరస్ వలన జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ళు నొప్పులు ఉంటాయన్నారు. వైద్యుల సలహా మేరకు మాత్రమే యాంటీ బయోటిక్స్ వాడాలన్నారు. పారాసిటమాల్ వాడడంతో పాటు ఆవిరి పట్టాలని అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, రేలంగి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలంతా విద్యావంతులు కావాలి



సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులు అర్పించిన వనిత సభ్యులు

కాకినాడ కల్చరల్: మహిళలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని ఇగ్నైటెడ్ హెల్పింగ్ మైండ్స్ అనుబంధ సంస్థ వనిత కో-ఆర్డినేటర్ కె.పావని అన్నారు. స్థానిక సాంబమూర్తినగర్‌లోని సంస్థ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి శుక్రవారం నిర్వహించి నివాళులు అర్పించారు. పూలే ఆదర్శంగా తీసుకొని మహిళలు అందరూ విద్యావంతులు కావాలని పావని అన్నారు. మైండ్స్ డైరెక్టర్ పీఎస్ గౌతమ్, డిప్యూటీ డైరెక్టర్ మహేష్, వనిత సభ్యులు లక్ష్మీ సౌజన్య, మసూద్, సఫియా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు తగవు

కాకినాడ సిటీ: ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులు, సస్పెన్షన్లు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. వార్షిక పరీక్షలు దగ్గర పడే వేళ పాఠశాలల పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అన్నింటికీ షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ ప్రతినిధులు కేవీవీ నగేష్, టి.అన్నారాము, బి.నాగమణి, ఎంవీ సాయిరాం, సీహెచ్ సూరిబాబు, టి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: గ్రామంలోని కొత్తపేటవీధిలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, పార్టీనాయకులు పాల్గొన్నారు.

పేట కాల్వ ఆధునీకరణకు మోక్షం!

- పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడ
- తిమ్మాపురం నుంచి మధురానగర్ డ్రెన్ విస్తరణ
- రూ.7లక్షలతో ప్రతిపాదనలు



రమణయ్యపేట-సర్పవరం మార్గంలో గుర్రపు డెక్కతో నిండిన తిమ్మాపురం నుంచి వచ్చే పేట కాల్వ

కాకినాడ రూరల్: కొద్ది పాటి వర్షానికే కాకినాడ రూరల్, నగరంలోని పలు పల్లపు ప్రాంతాలను ముంచేసే పేట కాల్వ (డ్రెయిన్)కు వేసవిలో మోక్షం కలగనుంది. తిమ్మాపురం నుంచి కాకినాడ మధురానగర్ వరకు సుమారు 5.5 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కాల్వను ఆధునీకరించేందుకు డ్రైనేజీ విభాగం అధికారులు ప్రతిపాదనలు చేశారు. కాల్వలోని తూటుకాడ, గుర్రపు డెక్క తొలగింపుతో పాటు పూడిక తొలగించనున్నారు. దీంతో కాలువను ఆనుకుని ఉన్న ప్రజలకు ముంపు, దుర్గంధం సమస్య తీరనుంది. వర్షాకాలం, తుఫానులు, భారీ వర్షాలు పడే సందర్భాల్లో సామర్లకోట మండలంలోని పలు గ్రామాల నుంచి తిమ్మాపురం మీదుగా పేట కాల్వలో మురుగునీరు చేరి ప్రవహిస్తుంది. పూడికతో నిండిన కాల్వలో మురుగు పోయే మార్గం లేక ఏటా తిమ్మాపురం పరిధిలోని అవంతినగర్, ఆంజనేయనగర్ మునిగిపోతున్నాయి. ఒక్కోసారి స్థానికులు తమ ఇళ్లకు వెళ్లాలంటే బోట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి. అవంతినగర్ వద్ద కాల్వలోకి రసాయన వ్యర్థాలు కూడా కలుస్తుండడంతో నీరు నలుపు రంగులో మారిపోతుంది. నీటి ప్రవాహం లేనపుడు దోమలకు చిరునామాగా ఈ పేట కాల్వ మారుతోంది. తిమ్మాపురం తరువాత రమణయ్యపేటలోని జనచైతన్య లే అవుట్, ఎఫ్‌సీఐ కాలనీ తదితర పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇటీవల ఇరిగేషన్ అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు త్వరలో ఈ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలం కాల్వల పూడికతీతకు అనుకూలంగా ఉంటుందని, తక్షణమే ఆ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు చేశాం

తిమ్మాపురం నుంచి మధురానగర్ వరకు విస్తరించి ఉన్న పేట కాల్వ ఆధునీకరణకు ప్రతిపాదనలు చేశాం. నిధుల మంజూరుకు ఆమోదం రానుంది. వేసవిలో పనులు పూర్తి చేసి, వర్షాకాలంలో మురుగు నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– రేష్మ, ఇరిగేషన్ జేఈ

పారిశుధ్యం మెరుగుపడాల్సిందే

- 15 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్
- నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు
- కార్పొరేషన్ కమిషనర్ రమేష్



కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రమేష్. చిత్రంలో ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. 15 రోజుల్లో పరిస్థితి మెరుగవకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావుతో కలసి ఆయన సమీక్షించారు. హూపర్ టిప్పర్ వాహనాలు సక్రమంగా ఇళ్ల వద్దకు వెళ్లకపోవడం, కొంతమంది కార్మికుల్లో నిర్లిప్తత, పర్యవేక్షణ లోపం వల్ల అనేక చోట్ల ప్రజలు చెత్తను రోడ్లపై వేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కమిషనర్ చెప్పారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పారిశుధ్య విభాగంలో అనేక పాలనా సంస్కరణలు చేపడు తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. టిప్పర్లు ఇకపై మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త సేకరించాలన్నారు. ఆ వాహనాల డ్రైవర్ల పనితీరు మారాలని, ఆ మేరకు కాంట్రాక్టు పొందిన ఏజెన్సీ ప్రతినిధులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితి చక్కదిద్దాలన్నారు. కొన్నిచోట్ల రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అటువంటి వారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని, అవసరమైతే తొలగిస్తామని పేర్కొన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం డస్ట్ బిన్లు, పుష్‌కార్ట్ వాహనాల మరమ్మతులకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే అందజేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 15 రోజుల్లో పారిశుధ్యంపై మార్పు కనిపించాలని కమిషనర్ స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ నాగ నరసింహారావు మాట్లాడుతూ కొన్నిచోట్ల హూపర్ టిప్పర్ వాహనాల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పారిశుధ్య విభాగంలో పర్యవేక్షణ లోపంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే విషయంలో పారిశుధ్య విభాగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైన్లలో పూడిక తీతలు వేగవంతం చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా సహకరించి చెత్తను ఇళ్లకు వచ్చే పారిశుధ్య కార్మికులకు, హూపర్ టిప్పర్ వాహనాలకు మాత్రమే అందజేయాలని కోరారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్, డీఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కార్మికుల గైర్హాజరుపై ఏడీసీ అసంతృప్తి



పారిశుధ్య కార్మికుల వివరాలను ప్రశ్నిస్తున్న ఏడీసీ నాగ నరసింహారావు

5, 6 సర్కిళ్ల పరిధిలోని ముత్తానగర్, గోళీలపేట ప్రాంతంలో పారిశుధ్య పనులను అదనపు కమిషనర్ నాగనరసింహారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐదో సర్కిల్లో 15 మంది కార్మికులు విధులకు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇలా ఒకేరోజు ఇంతమంది విధులకు హాజరు కాకపోతే ఎలా అని శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలను ప్రశ్నించారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆరో సర్కిల్ పరిధిలో కొన్నిచోట్ల చెత్త పేరుకుపోవడంపై వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుధ్య విభాగంలో నిర్లక్ష్య ధోరణిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కార్మికుల గైర్హాజరు అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ధర్మాజీ, రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధానికి ఓటమి ఉండదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామీజీ కమలానంద భారతి

బోట్‌క్లబ్: స్థానిక విద్యుత్‌నగర్ చల్లా కల్యాణమండపంలో శుక్రవారం ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవాలను ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తి సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణాజిల్లా గన్నవరం భువనేశ్వరి పీఠం స్వామిజీ కమలానంద భారతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ శివాజీ కారణజన్ముడని అన్నారు. 16 ఏళ్ల ప్రాయంలోనే యుద్ధం చేసి గెలిచారన్నారు. ధర్మం కోసం యుద్ధం చేసిన ఆయనకు ఓటమి తెలియదన్నారు. సమితి ఆధ్వర్యంలో ముద్రించిన ఛత్రపతి శివాజీ జీవిత చరిత్ర పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. తొలుత ధర్మధ్వజ స్థాపన, గౌరీపూజ, గోపూజ, భారతమాత పూజ, లక్ష్మీపూజ, సరస్వతీపూజ, లలితా సహస్ర పారాయణ, విష్ణు సహస్రపారాయణ, శ్రీమద్భగవద్గీత పఠనం, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. గోకులం అధ్యక్షుడు నారాయణం మురళి, సమితి అధ్యక్షులు జి.అన్నపూర్ణయ్య శర్మ, కార్యవర్గ సభ్యులు జి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.సుశీల తెలియజేశారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని, బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 24లోపు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ http://apgpcet.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో ఏప్రిల్ 23న ఉదయం ఐదో తరగతి, మధ్యాహ్నం ఇంటర్మీడియట్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

లాభసాటి సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ బాబూరావు

కరప: రైతులకు ఎప్పటికప్పుడు సాగులో మెళకువలపై అవగాహన కల్పించి, వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు వ్యవసాయ, అనుబంధ శాఖలు కృషి చేస్తున్నట్టు సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో శుక్రవారం జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీపంట ఆశాజనకంగా ఉందని, ఎక్కడైనా పంటతెగుళ్లు కనిపిస్తే సస్యరక్షణ చేపట్టాలన్నారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ రబీలో శివారు ప్రాంతాలకు సాగునీందించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కరప గరువుకాలువ పరిధిలో కరప, కొరిపల్లి, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, పెద్దాపుప్పాడు, యండమూరు గ్రామాల్లో మెరక, శివారు ప్రాంతభూములకు క్రాస్‌బండ్ల ద్వారా, ఇంజిన్లద్వారా తోడించి మండల, గ్రామకమిటీల ద్వారా సాగునీటి ఎద్దడి లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. మండల పశువైద్యాధికారి ఎం.రవికిరణ్‌బాబు మాట్లాడుతూ గాలికుంటువ్యాధి నివారణకు మండలానికి 14వేల డోసుల మందు రాగా ఇంత వరకు 4,500 డోసులను పశువులకు ఇచ్చినట్టు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమావేశానికి రాని అధికారులపై జిల్లా సమావేశంలో ఫిర్యాదు చేస్తామన్నారు. కరప విద్యుత్ సబ్‌స్టేషన్ సబ్ ఇంజినీరు టీవీవీ సత్యనారాయణ, ఏఈఓ స్వామిదాస్ నోవా, వీఏఏలు సీహెచ్ ప్రశాంత్, ఎస్.స్వర్ణతేజ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఉపాధ్యాయులకు జోన్-2 ఆర్జేడీ నాగమణి దిశా నిర్దేశం



గైగోలుపాడు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని, అందుకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు కాకినాడ జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి సూచించారు. మండలంలోని గైగోలుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్ష ఒత్తిడి లేకుండా బాగా రాయాలని సూచించారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన టాబ్‌లను వినియోగించుకుని బైజూస్ కంటెంట్‌ను ఫాలో అవ్వాలన్నారు. ఎంఈఓ గణేశ్వరరావు, హెచ్‌ఎం రవి తదితరులు పాల్గొన్నారు.



సాయి సత్యవ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా సాయి సత్య వ్రతాలు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురం పాస్టర్‌పేటలోని సీతారామ ఆలయ ప్రాంగణంలో ఉన్న షిరిడిసాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సాయి సత్యవ్రతాలు వైభవంగా నిర్వహించారు. 300 మంది ఈ వ్రతాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రమణాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ వ్రతా లు జరిగాయి. అనంతరం అన్నదానం నిర్వహించారు.

మరిడమ్మకు స్వర్ణపుష్పార్చన

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర నామార్చన నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు చిట్టెం హరిగోపాలశర్మ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే రాష్ట్ర ప్రగతి

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న



ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న పేర్కొన్నారు. స్థానిక 27వ డివిజన్ దూదిమిల్లు ప్రాంతంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సీఎం ఆశీస్సులతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కాకినాడ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ముఖ్యంగా సీఎం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పాలనా సంస్కరణలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ నిత్యం పేద ప్రజల సంక్షేమం కోసం పరితపించే సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో కూడా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఇటువంటి సీఎం పాలనలో పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, స్థానిక నాయకులు ఎస్.ఎస్.రాజు, రాజాన సూర్యప్రకాష్, మన్యం బాబి, వరిపల్లి కృష్ణవేణి, వరిపల్లి శివ, సిలుకూరి మనోజ్ పాల్గొన్నారు.

భద్రత పాటిస్తేనే ప్రమాదాల నివారణ

- ఫ్యాక్టరీల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ
- ఎన్‌ఎఫ్‌సీఎల్‌లో 52వ భద్రతా వారోత్సవాలు



ఎన్‌ఎఫ్‌సీఎల్‌లో భద్రతా పరికరాలను పరిశీలిస్తున్న డీఐ రాధాకృష్ణ

కాకినాడ రూరల్: భద్రతా సూత్రాలను పాటించడం ద్వారానే కర్మాగారాల్లో ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ డి.రాధాకృష్ణ పేర్కొన్నారు. స్థానిక నాగార్జున ఫెర్టిలైజర్స్ కర్మాగారంలో 52వ భద్రతా వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. కర్మాగారంలోని పలు విభాగాలు పరిశీలించి, రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు నివారించడానికి ప్లాంట్ డిజైన్ దశ నుంచే విధాన రూపకల్పన, వ్యక్తి గత రక్షణ పరికరాల వినియోగంలో ఎన్‌ఎఫ్‌సీఎల్ తగు జాగ్రత్తలు పాటిస్తుందన్నారు. భద్రతా వారోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రమాద రహితమే లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన మాక్ డ్రిల్‌లో పాల్గొన్న అధికారులను ఆయన అభినందించారు. ఎన్‌ఎఫ్‌సీఎల్ సీనియర్ జీఎం పి.చంద్రమోహన్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతో ప్లాంట్ భద్రతకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. మెయింటెనెన్స్ హెడ్ పి.విజయకుమార్ మాట్లాడుతూ ప్లాంట్‌లో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పని ఒత్తిడిని జయించేందుకు వివిధ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఆ పోటీల్లో విజేతలకు డీఐ రాధాకృష్ణ బహుమతులు అందజేశారు. ఫైర్ అండ్ సేఫ్టీ హెడ్ మహంతి, సిబ్బంది రాజు, గంగాసింగ్, శ్రీనివాసరావు, రమాదేవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి సీఎం కృషి

- ఎమ్మెల్యే ద్వారంపూడి



జాషువా గిరిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జాషువా గిరి శుక్రవారం పలువురు క్రైస్తవ ప్రతినిధులతో ఎమ్మెల్యే ద్వారంపూడిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. సీవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు బీహెచ్‌వీ మూర్తిరాజు ఆధ్వర్యంలో వీరంతా ద్వారంపూడితో భేటీ అయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీవైఎఫ్ ఆవిర్భావం నుంచి ఎంతో కష్టించి పనిచేస్తున్న జాషువాగిరి వంటి వారిని గుర్తించి పదవులు ఇచ్చారన్నారు. క్రైస్తవులకు సంబంధించి పాస్టర్లకు ఇచ్చే గౌరవవేతనం, చర్చిల అభివృద్ధికి సీఎం కేటాయించిన ప్రత్యేక నిధులు, ఇతర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి మరింత పనిచేయాలని సూచించారు. సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్, సీవైఎఫ్ ప్రతినిధులు డాక్టర్ వరప్రసాద్, జంగా గగారిన్, జోయల్, జిమ్ వెల్సన్, మచ్చా బుజ్జి, డేవిడ్ శ్యామ్, వారా వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు హృద్రోగులకు పునర్జన్మ

- కాకినాడ వైద్యుల ఘనత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాఘవ

కాకినాడ క్రైం: కాకినాడ వైద్యులు నలుగురు హృద్రోగులకు పునర్జన్మనిచ్చారు. ప్రాణాంతక స్థితికి చేరిన వారి ప్రాణాలను గంటల వ్యవధిలోనే నిలిపి వారి కుటుంబాల్లో ఆనందం నింపారు. ఈ మేరకు కాకినాడ రాఘవ ఎమర్జెన్సీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ నగేష్‌బాబు ఆసుపత్రిలోని కాన్ఫరెన్సు హాల్లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, గల్ఫ్‌లో నివాసం ఉండే కాకినాడ రేచర్లపేటకు చెందిన మేరీ గుండె పోటుకు గురైంది. అక్కడి వైద్యులు రూ.50 లక్షలు అడిగారు. దీంతో స్థోమత లేక హైదరాబాద్‌కు చేరింది. వారూ రూ.10 లక్షలు పైగా ఖర్చవుతుందని చెప్పడంతో ఆందోళన చెందింది. బాధితురాలి సోదరుడి సలహా మేరకు, కాకినాడకు వచ్చి రాఘవ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆమెకు అత్యంత నామమాత్రపు ఖర్చుతో కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ సర్జరీ నిర్వహించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. అలాగే కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన పార్వతికి వాల్వ్ రీప్లేస్‌మెంట్ విజయవంతంగా నిర్వహించి పునర్జన్మ ప్రసాదించారు. మరో ఇద్దరికి శుక్రవారం శస్త్రచికిత్స నిర్వహించారు. సీఏబీసీ విధానం ద్వారా గుండె పనితీరు యథాస్థితికి చేరింది. అంతకు ముందు వీరంతా ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని డాక్టర్ నగేష్ బాబు తెలిపారు. ఆసుపత్రి చైర్మన్ కార్డియాలజిస్టు రాఘవ చౌదరి ఆధ్వర్యంలో కార్డియాక్ సర్జన్ డాక్టర్ ప్రశాంత్ ఈ శస్త్రచికిత్సలు చేసినట్టు తెలిపారు. డాక్టర్ ముజీబ్, డాక్టర్ కావ్య శస్త్రచికిత్సల నిర్వహణలో కీలక పాత్ర పోషించారని డాక్టర్ రాఘవ చౌదరి తెలిపారు. తాజా శస్త్రచికిత్సలతో తమ ఆస్పత్రి 700 శస్త్రచికిత్సల మార్కును చేరుకుందని ఆయన ప్రకటించారు. తాజాగా చేసిన కీలక శస్త్ర చికిత్సలన్నీ ఆరోగ్య శ్రీ పరిధిలో నిర్వహించామనీ, రోగులకు ఎటువంటి ఆర్థిక భారం పడలేదని డాక్టర్ రాఘవ వెల్లడించారు. హృద్రోగాలు సైతం ఆరోగ్యశ్రీలో పొందుపరచడం బాధితులను ఓ వరమంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కొనియాడారు. ఈ సమావేశంలో డాక్టర్ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామికి బంగారు గొలుసు సమర్పణ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వేంచేసిన సీతారామస్వామి వారి ఆలయానికి భక్తులు శుక్రవారం బంగారు గొలుసులు సమర్పించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామాచార్యులు తన భార్య రేజేటి లక్ష్మి పేరున రూ.3.5 లక్షల విలువైన 62 గ్రాముల మూడు బంగారు గొలుసులు, రెండు లాకెట్లు సీతా రామస్వామి, సీతాదేవి, లక్ష్మణస్వామికి సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దామెర దివాకర్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిఠాపురం: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన దెయ్యాల పెద అప్పారావు గురువారం రాత్రి గొల్లప్రోలులో రోడ్డుపై నడిచి వెళుతుండగా వేగంగా వచ్చిన మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెదఅప్పారావుకు తీవ్ర గాయాలవ్వడంతో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.